సాక్షి
సిద్దిపేట
ఆదివారం : 2 : జూన్ : 2024

వేడుకలకు ముస్తాబు



కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అవతరణ వేడుకలను సాదాసీదాగా నిర్వహించనున్నారు.

సిద్దిపేటరూరల్:



- రంగనాయక, కొండ పోచమ్మ, మల్లన్న సాగర్‌లతో సాగు నీరు
- పదేళ్లలో అధికంగా వరి పంట
- ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతుబీమాతో ప్రోత్సాహం
- యాంత్రీకరణ, విత్తన సబ్సిడీకి మంగళం



పండగలా వ్యవసాయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సిద్దిపేట జిల్లాలోని వ్యవసాయరంగంలో సమూల మార్పులు వచ్చాయి. పంటల తీరు తెన్నులు మారిపోయాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్.. రైతుబంధు.. రైతుబీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నదాతల్లో భరోసా నింపగా.. మరో వైపు రంగనాయక సాగర్, కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్ ల నిర్మాణం. ..మిషన్‌కాకతీయ పథకం కింద చెరువుల అభివృద్ధి పనులు.. ఇలా స్వరాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలు అన్నదాతలకు అండగా నిలిచాయి. మరోవైపు ఎత్తివేసిన విత్తన సబ్సిడీ.. యాంత్రీకరణకు మంగళం.. వంటి నిర్ణయాలు నిరాశకు గురి చేశాయి.

కాళేశ్వరం నీటితో సిద్దిపేట ప్రాంతం సస్యశ్యామలం అయింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు కరువు విలయతాండవం చేసింది. సిద్దిపేట జిల్లా లో పశువులకు గడ్డి దొరకని పరిస్థితి వుండేది. అప్పట్లో గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి సరఫరా చేసే వారు. జిల్లాలో చిన్న కోడూరు మండల పరిధిలో రంగనాయక సాగర్, తొగుట మండల పరిధిలో మల్లన్న సాగర్, మర్కుక్ మండలంలో కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ లు నిర్మించడంతో గ్రౌండ్ వాటర్ పెరిగింది. జిల్లాలో ఉన్న చెరువులను రిజర్వాయర్ ల ద్వారా నింపారు. దీనితో రెండు పంటలకు నీళ్ళు అందడం తో సాగు విస్తీర్ణం పెరిగింది.

సంవత్సరం.	వాన కాలం	యాసంగి
2016-17.	4,63,038.	1,80,181
17-18.	4,65,698.	1,55,922
18-19.	4,43,550.	1,05,578
19-20.	4,99,816.	1,93,084
20-21.	5,33,138.	3,11,204
21-22.	5,15,056.	2,83,890
22-23.	5,25,527.	3,66,343
23-24.	5,20,690.	3,82,335

పంటల తీరులో మార్పులు..

పంటల తీరులో కూడా మార్పులు వచ్చాయి. సాగునీటి వసతి పెరగడంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వాతావరణం అనుకూలించడంతో పాటు, ఉచిత విద్యుత్ అమలవుతుండటంతో బోర్ల కింద వరి సాగు చేసిన రైతులకు కలిసొచ్చింది. .

యాంత్రీకరణ, సూక్ష్మసేద్యానికి మంగళం..

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని గత ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో రైతులకు సబ్సిడీపై అందాల్సిన రొటోవేటర్లు వంటి యంత్రపరికరాల కొను గోలుకు అధిక భారం పడుతోంది. రెండు విడతలుగా ట్రాక్టర్లు మంజూరు చేసినప్పటికీ అవి రాజకీయ నేతలకే అందడంతో చిన్న, సన్నకారు రైతులకు నిరాశే ఎదురైంది.

రైతుబంధుతో భరోసా..

పంటలు సాగుకు పెట్టుబడి అవసరం ఉంటుంది. ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులు ఇలా ఏటా రైతులకు భారమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.10 వేల పంట పెట్టుబడి సాయం అందిస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లాలో సుమారు 3.60 లక్షల మంది రైతులకు ఆర్థిక సాయాన్ని ఖాతాల్లో జమ చేస్తున్నారు.

రైతుబీమాతో ఆసరా..

ఏ కారణంతోనైనా రైతు మరణిస్తే బాధిత కుటుంబానికి రైతుబీమా పథకం కింద రూ.ఐదు లక్షలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 4,950 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల చొప్పున రూ. 350కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ రెండు పథకాలు రైతులకు బాసటగా నిలిచాయి.

సబ్సిడీ విత్తనాలకూ రాంరాం..

గతంలో వానాకాలం, యాసంగి సీజన్లలో చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేసే వారు. ప్రధానంగా సోయా, శనిగ, కందులు, వరి, జొన్న వంటి విత్తనాలను 50 శాతం మేరకు సబ్సిడీపై అందించే వారు. ఐదేళ్లుగా విత్తన సబ్సిడీని నిలిపివేయడంతో రైతులపై భారం పడుతోంది. మరోవైపు పెరిగిన ఎరువుల ధరలతో రైతులకు పంట సాగు భారంగా మారుతోంది.



మల్లన్న సాగర్

ఆరోగ్యానికి పెద్దపీట

- పదేళ్లలో వైద్య రంగంలో సమూల మార్పులు
- అందుబాటులోకి ఆధునిక వైద్యం
- సిద్దిపేటలో మెడికల్, నర్సింగ్ కాలేజీలు
- డయాగ్నోస్టిక్ హబ్‌లో ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు



సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో సకల సౌకర్యాలు కల్పించారు. దీంతో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వైద్యరంగంలో సిద్దిపేట జిల్లాకు పెద్దపీట వేశారు. 2000 సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా వెయ్యి పడకల ఆస్పత్రిని నిర్మించారు. గత యేడాది తాత్కాలికంగా నూతన భవనాన్ని ప్రారంభించారు. చిన్నకోడూరు మండలంలో రామంచలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరంగనాయక బీఫార్మసీ కళాశాలను కూడా ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలో 108 అబులెన్సులు అందుబాటులోకి తెచ్చారు. దీంతో అత్యవసర సమయంలో ఈ అంబులెన్సులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో 10 బస్తీ దవాఖానలను సైతం ఏర్పాటు చేశారు. అదేవిధంగా సిద్దిపేటలో నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేశారు. దుబ్బాక, హుస్నాబాద్‌లో డయాలసిస్ సేవలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనివల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం జనరల్ ఆస్పత్రిలో కీమో థెరఫీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అందుబాటులోకి డయోగ్నోస్టిక్ హబ్

వ్యాధికి తగ్గట్టు వైద్యం అందాలంటే రోగ నిర్ధారణ కీలకం. రోగ నిర్ధారణ పరీక్షల కోసం నిరుపేదలు సైతం ప్రైవేట్ డయోగ్నోస్టిక్ కేంద్రాల్లో రూ.వేలు ఖర్చు చేసుకోవాల్సి వచ్చేది. పేద ప్రజలందరికీ పైసా ఖర్చు లేకుండా 57 రకాల వైద్య పరీక్షలను ప్రభుత్వం ఈ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తెచ్చింది. గర్భిణులకు ఉచితంగా టిఫా స్కానింగ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే సాధారణ స్కానింగ్, ఎక్స్‌రే సేవలు అందుతున్నాయి.

సంగారెడ్డిలో జిల్లాలో

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సంగారెడ్డి జిల్లా వాసులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడంతో ఉన్నత వైద్యం చేరువైంది. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనేది జిల్లా వాసుల ఎన్నో ఏళ్ల కల. ఈ కలను సాకారం చేస్తూ గత ప్రభుత్వం 2022 నవంబర్ 15న సంగారెడ్డికి మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది జిల్లాలకు ఈ కాలేజీలు మంజూరు కాగా, అందులో సంగారెడ్డి మెడికల్ కాలేజీ ఒకటి. ఈ కాలేజీల భవనాల నిర్మాణాలకు తొలుత రూ.30 కోట్లు మంజూరయ్యాయి. 2022–23 విద్యా సంవత్సరం నుంచి వైద్య విద్య అందుబాటులోకి వచ్చింది. 150 మెడికల్ సీట్లతో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. అన్ని విభాగాలకు ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను సైతం నియమించారు. కాలేజీకి అనుబంధంగా ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పడకల సంఖ్యను భారీగా పెంచారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ కూడా మంజూరైంది. ఈ కాలేజీలో విద్యాబోధన కొనసాగుతోంది.



173 పల్లె.. 19 బస్తీ దవాఖానాలు

దేశ రాజధాని ఢిల్లీ తరహాలో ప్రభుత్వం రాష్ట్రంలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. దీంతో ప్రాథమిక వైద్యం ఇంటికే చేరువైంది. పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయడంతో జ్వరం వంటి చిన్న చిన్న జబ్బులకు చికిత్స చేయించుకునేందుకు పట్టణాల్లోని జిల్లా కేంద్ర, ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇలా జిల్లాలో 173 పల్లె దవాఖానాలు, 19 బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలు అందుతున్నాయి.

పైసా ఖర్చు లేకుండా పరీక్షలు



వ్యాధికి తగ్గట్టు వైద్యం అందాలంటే రోగ నిర్ధారణ కీలకం. రోగ నిర్ధారణ పరీక్షల కోసం నిరుపేదలు సైతం ప్రైవేట్ దయగ్నస్టిక్ కేంద్రాల్లో రూ.వేలు ఖర్చు చేసుకోవాల్సి వచ్చేది. పేద ప్రజలందరికీ పైసా ఖర్చు లేకుండా 57 రకాల వైద్య పరీక్షలను ప్రభుత్వం ఈ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తెచ్చింది. 2021 జూన్‌లో అందుబాటులోకి వచ్చిన ఈ కేంద్రాల్లో నిత్యం రక్త, మూత్ర పరీక్షలు జరుగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు ప్రస్తుతం మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్‌లో కూడా ఈ దయగ్నస్టిక్ కేంద్రం సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో రేడియాలజికల్ ల్యాబ్ ద్వారా సేవలు అందుతున్నాయి.

• 'దశ' తిరిగింది
ప్రగతి పరుగులు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత జిల్లా 'దశ' తిరిగింది. అన్నిరంగాలు అభివృద్ధి వైపు అడుగులు వేశాయి. వ్యవసాయరంగంలో సమూల మార్పులు వచ్చాయి. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాల ప్రోత్సాహంతో వ్యవసాయరంగం వృద్ధి చెందింది. ఆయకట్టు స్థిరీకరణ పెరిగింది. పదేళ్లలో రైతు 'పంట'పండింది. అలాగే.. పేదలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. మెడికల్, నర్సింగ్ కళాశాలలు, టీ-డయోగ్నోస్టిక్ కేంద్రం, బస్తీ దవాఖానాల ఏర్పాటుతో వైద్యం పేదల దరిన చేరింది. జిల్లాలో పట్టణీకరణ భారీగా పెరిగింది. మిషన్ భగీరథతో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించింది. 161వ జాతీయ రహదారి నిర్మాణంతో రానున్న రోజుల్లో జిల్లా మరింత అభివృద్ధి బాటలో పయనించే అవకాశాలున్నాయి. గ్రామీణ రోడ్ల ప్రగతి ఆశించిన స్థాయిలో జరగలేదు. పదేళ్లలో జిల్లా ప్రగతి వైపు పరుగులు పెట్టిందని, అయితే.. ఇంకా సాధించాల్సింది చాలానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. - సాక్షి సిద్దిపేట




నెరవేరిన ఎన్నో ఏళ్ల కల

సిద్దిపేట ప్రజల ఎన్నో ఏళ్ళ కల నెరవేరింది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రూ. 2,800 కోట్లతో మనోహరాబాద్, మేడ్చల్, కొత్తపల్లి(కరీంనగర్) 151 కిలో మీటర్ల రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించారు. గత ఏడాది అక్టోబర్ 3 వ తేదీన సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ కు రైలు సేవలు ప్రారంభం అయ్యాయి. అలాగే మెదక్ - సిద్దిపేట - ఎల్కతుర్తి 565డీజీ జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో వాహన దారుల కొంత ఇబ్బంది పడుతున్నారు. త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. సిద్దిపేట పట్టణం లో ఇన్నర్ రింగ్ రోడ్ పనులను రూ 160 కోట్ల తో చేపట్టారు. పనులు కొనసాగుతున్నాయి.



పట్టణీకరణ పైపైకి..

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రత్యేక రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాలో పట్టణీకరణ భారీగా పెరిగింది. కొత్తగా నాలుగు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న ఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం కొత్త బల్దియాలుగా రూపాంతరం చెందాయి. జిల్లా కేంద్రం సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట తెలంగాణ ఆవిర్భావానికి ముందే ఉండగా, తెలంగాణ స్వయం పాలనలో నాలుగు కొత్త మున్సిపాలిటీలు వచ్చాయి. పట్టణాల్లో తాగునీటి సౌకర్యం మెరుగు పడింది. ఒక్క బొల్లారం మున్సిపాలిటీ మినహా మిగిలిన అన్ని చోట్ల తాగునీటి సమస్య దాదాపు పరిష్కారం లభించింది. ప్రభుత్వం మిషన్ భగీరథ కింద ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించడంతో పట్టణ వాసుల తాగునీటి కష్టాలు చాలా మట్టుకు తీరాయి. ఇక అంతర్గత రహదారుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. వానాకాలం వస్తే చాలు వాహనదారులకు నరకం చూపుతున్నాయి.



మురికి కాల్వలు దయనీయం

పట్టణాల్లో చాలా చోట్ల మురికి కాల్వలు, పెద్ద పెద్ద డ్రైనేజీలు కబ్జాకు గురయ్యాయి. దీంతో పట్టణాల్లో మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారైంది. వర్షం పడితే చాలు మురికి కాల్వల్లోని నీరంతా రోడ్లపై పారడం పరిపాటిగా మారింది. అలాగే పట్టణాల్లో శివారు కాలనీలు సమస్యలకు నిలయాలు మారాయి. పెరిగిన పట్టణ విస్తీర్ణానికి సరిపడా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో శివారు కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.





ఔటర్ రింగ్ రోడ్

సిద్దిపేట మున్సిపాలిటీకి అవార్డుల పంట

ప్రత్యేక రాష్ట్రంలో జిల్లాలో పట్టణీకరణ భారీగా పెరిగింది. జిల్లాలో ఒక మున్సిపాలిటీ, రెండు నగర పంచాయతీలు వుండేవి. ఇప్పుడు ఐదు మున్సిపాలిటీ లకు చేరాయి. తెలంగాణ ఏర్పాటుకు ముందు సిద్దిపేట ఒక్కటే మున్సిపాలిటీ వుండేది. రాష్ట్రం వచ్చాక గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. సిద్దిపేట లో అమృత్ పథకంలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. స్వచ్ఛ మున్సిపాలిటీ గా గుర్తింపు వచ్చింది. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 22 అవార్డులను అందుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా స్వచ్ఛ బడిని ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తడి పొడి చెత్తను ఇంటి ఇంటి నుంచి సేకరిస్తున్నారు. తడి చెత్త తో సీ ఎన్ జీ గ్యాస్ ను తయారు చేస్తున్నారు. అలాగే సేంద్రియ ఎరువును తయారు చేసి విక్రయిస్తున్నారు. గజ్వేల్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తుది దశ కు చేరింది. హుస్నాబాద్ పట్టణం స్వచ్ఛ సర్వేక్షన్ లో రెండు మార్లు అవార్డును అందుకున్నారు. హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల పట్టణాలు సైతం మెరుగైన అభివృద్ధి జరిగింది.

ఉద్యమ ఘట్టాలు
మధుర జ్ఞాపకాలు



తెలంగాణ రాష్ట్రం కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో అలుపెరుగకుండా పోరాడారు. కల సాకారం కోసం ఆత్మబలిదానాలను చేసుకున్నారు. ఆమరణ దీక్షలు చేపట్టారు. ఇలా ఒక్కొక్కటిగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఉధృతమయ్యాయి. ఒక ఉద్యమంగా ముందుకు సాగుతుండగా.. సకల జనులందరూ భాగస్వామ్యం అయ్యారు. కావాలనుకున్న ప్రత్యేక తెలంగాణను పోరాడి సాధించుకున్నారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో వందలాది మంది ఉద్యమకారులు పట్టువీడని విక్రమార్కుల్లా పోరాడారు. ఆఖరికి స్వరాష్ట్ర కలం సాకారమైంది. జూన్ 2న రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతోంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనాలు..



విద్యార్థి జేఏసీ అధ్యక్షుడిగా రామకృష్ణ ఆధ్వర్యంలో పాదయాత్ర

విద్యార్థి జేఏసీ పాదయాత్ర

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన పత్తిరి రామకృష్ణ పోరాట పటిమను ప్రదర్శించారు. 2010లో విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన ఖేడ్ నియోజకవర్గంలో 12 రోజుల పాటు యువకులతో కలిసి ప్రధాన పట్టణాల్లో పాదయాత్ర చేపట్టి జనాలను చైతన్యపరిచారు. తెలంగాణ ఉద్యమంవైపు ఆకర్షితులు అయ్యేలా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఖేడ్‌లో ధూంధాం నిర్వహించి యువత, విద్యార్థులను చైతన్యపరిచారు.

చారిత్రాత్మక ఘట్టం.. సిద్దిపేట దీక్షలు

సాక్షి, సిద్దిపేట: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో సిద్దిపేటలోని పాత బస్టాండ్, నంగునూరు మండలం పాలమాకులలో చేపట్టిన దీక్షలు చారిత్రాత్మక ఘట్టంగా నిలిచాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో జేఏసీ ఆధ్వర్యంలో సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలో 24, డిసెంబర్ 2009 నుంచి నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నియోజకవర్గంలో మహిళా స్వయం సహాయక బృందాలు, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో మార్చి 13, 2014వ తేదీ వరకు మొత్తంగా 1,531 రోజులు దీక్షలు చేశారు.

పండుగ పబ్బం లేకుండా..

పండుగ పబ్బం తేడా లేకుండా మహాశివ రాత్రి, దసరా, ఉగాది పండగలు ఉద్యమకారులు దీక్షా శిబిరం వద్దే జరుపుకొన్నారు. దేశపతి శ్రీనివాస్, మధుప్రియ, దరువు అంజన్న, రసమయి బాలకిషన్ గాయకులెందరో తమ గానాన్ని వినిపించారు. ఈ దీక్షలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పలు మార్లు సందర్శించి, ఉద్యమకారుల్లో నూతనోత్తేజం నింపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక, సిద్దిపేటలో దీక్షలు నిర్వహించిన స్థలంలో 2015 జూలై 4న పాత బస్టాండ్ వద్ద సీఎం కేసీఆర్ చేతుల మీదుగా దీక్షల స్మృతి చిహ్నంగా దీక్ష స్థలి పైలా ఆవిష్కరించారు.



దీక్షా స్థలి పైలాన్ వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు(ఫైల్)

తలమానికం.. తెలంగాణ తల్లి మండపం

హత్నూర(సంగారెడ్డి): ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ద కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యమం నాటి గుర్తులను మననం చేసుకుందాం. హత్నూర మండలం దౌల్తాబాద్ కాసాల చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహంతో కూడిన మండపాన్ని 2010 సెప్టెంబర్ 15న అప్పటి ఉద్యమకారుడు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. ఇది రాష్ట్రానికే తలమానికంగా నిలిచింది. మందిరాన్ని తలపించేలా చౌరస్తాలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ సమక్షంలో డిజైన్ ఎంపిక చేశారు. నిర్మాణానికి జనార్దన్ రెడ్డి దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి సుందరమైన మండపాన్ని ఏర్పాటు చేయించారు. 2011 మార్చి 7వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు పెట్టి కాల్చి బూడిద చేశారు. దీంతో జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. అనంతరం వారంలోనే తిరిగి విగ్రహాన్ని జనార్దన్ రెడ్డి ఏర్పాటు చేయించారు. కాగా, హత్నూర మండలానికి చెందిన ఐదుగురు ఉద్యమకారులు ఇక్కడే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు.



తెలంగాణ తల్లి మండపం



కోనాయిపల్లిలో గులాబీ పార్టీకి బీజం పడింది..

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష, ఉద్యమానికి నంగునూరు మండలంలోనే తొలి బీజం పడింది. ప్రజా ఉద్యమంతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమని నమ్మిన గులాబీ దళాధిపతి కేసీఆర్ 2001లో తెలుగుదేశం పార్టీకి.. డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. తన సెంటిమెంట్ అయిన నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి హైదరాబాద్‌లోని జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపిస్తున్నట్లు ప్రకటించారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేశారు. ఆయన పిలుపు మేరకు నంగునూరు మండలంలో ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, బతుకమ్మ, బోనాలు, వేర్లతో నిరసన తెలుపుతూ ఉద్యమానికి దన్నుగా నిలిచారు. కేసీఆర్ ఆమరణ దీక్ష భగ్నం కావడంతో శాంతియుతంగా పోరాటం చేయాలనే సంకల్పంతో పాలమాకులలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అన్ని గ్రామాల నుంచి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తరలొచ్చి పండుగలు, పబ్బాలను పక్కన పెట్టి నిరంతరాయంగా 1,144 రోజుల పాటు దీక్షలు చేశారు.



పార్టీ ప్రకటనకు ముందు కోనాయిపల్లిలో పూజలు చేసి వస్తున్న కేసీఆర్



పాలమాకులలో చివరి రోజైన 1,144 రోజుల దీక్షలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

రాజ్యాలు పోయిన.. చిహ్నాలు పదిలం

చిన్నశంకరంపేట(మెదక్): రాజులు పోయారు రాజ్యాలు పోయాయి. కానీ వారి గుర్తులు మాత్రం చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. నాటి వైభవానికి చిహ్నాలుగా నిర్మించిన అద్భుత కట్టడాలు మన ముందు నిలిచాయి. చిన్నశంకరంపేట మండలంలో పలు గ్రామాల్లో చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన రాజరికపు చిహ్నాలు మనకు కన్పిస్తాయి. కాగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చిహ్నం మార్పుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో కథనం.

ఏనుగుల తూము

చిన్నశంకరంపేట–అంబాజిపేట గ్రామాల మధ్యన పెద్ద చెరువును కాకతీయుల కాలంలో ఏర్పాటు చేశారు. ఇందుకు నిదర్శంగా తూముకు కాకతీయుల అధికారిక చిహ్నం ఏనుగుల బొమ్మలను చెక్కారు. ఇప్పటికీ చెక్కు చెదరకుండా బొమ్మలు ఉన్నాయి. స్థానికులు ఇప్పటికీ పెద్ద చెరువు తూమును ఏనుగుల తూముగా పిలుచుకుంటారు.

చోళుల.. సోమేశ్వరాలయం

చిన్నశంకరంపేటలో చోళుల కాలంలో నిర్మించిన సోమేశ్వరాలయం.. ఏకశిల స్తంభాలు నేటికీ భక్తులకు దర్శనమిస్తుంది. మొఘల్ సామ్రాజ్య విస్తరణ సమయంలో హిందు దేవాలయాలను విధ్వంసం చేస్తున్న సమయంలో స్థానికులు సోమేశ్వరాలయాన్ని మట్టిదిబ్బలో కప్పి పెట్టి కాపాడుకున్న చరిత్ర ఉంది. చోళుల కాలంలో నిర్మించిన అరుదైన ఆలయంగా పేరుగాంచింది.

కామారంలో ఆవుదూడ శిల్పం...

కామారంలో పాపన్నపేట సంస్థానానికి చెందిన జమీందర్‌లు నిర్మించిన ఇంటికి నేటికీ ఆవుదూడ శిల్పం ఉంది. ఆనాటి ఇళ్లు శిథిలమైనప్పటికీ అప్పట్లో నిర్మించిన ఎత్తయిన గోడకు ఆవు దూడ శిల్పం గుర్తుగా నిలిచింది.



అమరుల స్థూపం

తెలంగాణ ఉద్యమ సమయంలో చిన్నశంకరంపేటలో మెదక్ ప్రధాన రహదారికి పక్కన తెలంగాణ అమరుల స్థూపం నిర్మిస్తే కేసీఆర్ ఆవిష్కరణ చేశారు. టీఆర్ఎస్(బీఆర్ఎస్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న ఏటా తెలంగాణ విమోచ దినోత్సవాలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జూన్ 2న చిన్నశంకరంపేట అమరుల స్థూపం వద్ద ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి నివాళులర్పించి మెదక్ కలెక్టరేట్‌లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



చిన్నశంకరంపేట మండలం చందంపేటలో నిర్మించిన దుర్గం కోట

కోటదుర్గం

చిన్నశంకరంపేట మండలం చందంపేటలో నిర్మించిన కోటదుర్గం చరిత్రను చాటుతుంది. పాపన్నపేట సంస్థానంలో 1,395 నుంచి 1,422 మధ్య కాలంలో రాణి చందమ్మ ఏకఛత్రాధిపత్యంలో రాజ్యవిస్తరణకు నడుం బిగించిన కాలంలో నిర్మాణం జరుపుకొన్న కట్టడమే చందంపేట కోటదుర్గం. ఆమె పేరుతో చందంపేట పేరు వచ్చిందని చరిత్ర కారులు చెబుతుంటారు.

అసెంబ్లీలో తెలంగాణ నినాదం



నారాయణఖేడ్: ఉవ్వెత్తున ఎగసిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎందరో తమ పోరాట పటిమను ప్రదర్శించారు. కలలు గన్న స్వరాష్ట్రాన్ని సాధించారు. అందులో భాగంగానే ఖేడ్ నియోజకవర్గంలోని బోర్గి గ్రామానికి చెందిన ఉమ్మడి మెదక్ జిల్లా సివిల్ కానిస్టేబుల్ సంజీవులు నిర్బంధాలను సహించబోమని స్వరాష్ట్ర సాధనపై గొంతు విప్పారు. ఆయన ప్రభుత్వ రైల్వే పోలీస్ సికింద్రాబాద్ (జీఆర్‌పీ) కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. 2013 అక్టోబర్ 10న పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని యూనిఫామ్‌లోనే ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలోని సీఎల్‌పీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి జై తెలంగాణ నినాదాలు చేశారు. నాడు అతడిని అదుపులోకి తీసుకున్న అప్పటి ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. అనంతరం ఆయన తెలంగాణ రాష్ట్ర పోరాటాన్ని సాగించారు.

కూతురు పేరు 'జై తెలంగాణ'



కూతురు జై తెలంగాణతో మేకల నాగేశ్వర్, పద్మావతి దంపతులు

మెదక్‌జోన్: కూతురికి జై తెలంగాణ అని పేరు పెట్టారు నాగేశ్వర్, పద్మావతి దంపతులు. వీరికి 2004 ఏప్రిల్ 23న కూతురు జన్మించింది.. మెదక్ జిల్లా పిల్లికోటాల్ ప్రాంతం వారిది. అవిధంగా పేరు ఎందుకు పెట్టావని ప్రశ్నిస్తే ఇలా చెప్పుకొచ్చారు. 1999లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయాన అసెంబ్లీలో వరంగల్ ప్రాంతానికి చెందిన ఓ ఎమ్మెల్యే తమ తెలంగాణ ప్రాంతం వెనుకబడిందని, నిధులు ఎక్కువ మొత్తంలో ఇవ్వాలని కోరారు. చంద్రబాబు వెంటనే జోక్యం చేసుకొని ఇక తెలంగాణ అనే పదాన్ని ఎవరూ పలక వద్దన్నారు. కేవలం వెనుకబడిన ప్రాంతంగా మాత్రమే పిలవాలన్నారు. ఇది తనకు నచ్చలేదని దీంతో కూతురికి ఆ పేరు పెట్టాలని నాగేశ్వర్ తెలిపారు. అయితే టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత నాగేశ్వర్ చురుకైన కార్యకర్తగా పనిచేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో హరీశ్‌రావు నుంచి మొదలుకుని అప్పటి స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వరకు చిన్నారి జై తెలంగాణను ఎత్తుకుని ఉద్యమాల్లో పాల్గొన్నారు. కాగా, 2009 డిసెంబర్ 9న శ్రీకృష్ణ కమిటీ మెదక్ జిల్లాకు వచ్చింది. చిన్నారి 'జై తెలంగాణ' ను పరిచయం చేస్తే ఒక్క మామూలు వ్యక్తికి స్వరాష్ట్రంపై ఎంత మక్కువ ఉంటే ఈ పేరు పెట్టుకున్నాడని అవాక్కైంది. అప్పుడు చిన్నారికి 5 ఏళ్ల వయసు. ఉంటుంది. వారు సైతం ఆప్యాయంగా ఎత్తుకుని ముద్దాడి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఇంతగొప్పదా ఉందంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఉద్యమకారుల అడ్డా.. దుబ్బాక గడ్డ



2009లో హైదరాబాద్‌లో ఆందోళన చేసేందుకు ఉద్యమకారులతో వెళ్తున్న హరీశ్‌రావు, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, ఉద్యమకారులు

దుబ్బాక: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దుబ్బాక చరిత్ర మరువలేనిది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి నాయకత్వంలో జరిగిన పోరాటంలో పోలీసుల అరెస్టులు, లాఠీలు, తూటాలకు ఎదురొడ్డి వందలాది మంది ఉద్యమకారులు ముందుకు సాగారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న రామలింగారెడ్డిపై అప్పటి ప్రభుత్వం ప్రత్యేకంగా షాడో పోలీస్ టీంను ఏర్పాటు చేసింది. ఆయనపై ఏకంగా 150కి పైగా కేసులు నమోదయ్యాయి. దుబ్బాక నియోజకవర్గం నుంచి మరో 400 మందికిపైగా ఉద్యమకారులు జైలు జీవితం గడిపారు. 23 మంది బలిదానం చేశారు. అలాగే దుబ్బాక తెలంగాణ ఉద్యమకారుడు గుండవెల్లి ఎల్లారెడ్డిపై 40 కి పైగా కేసులు నమోదయ్యాయి. దుబ్బాకకు చెందినరొట్టె రాజమౌళి.. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆప్తమిత్రుడు. మలిదశలో జేఏసీ కన్వీనర్‌గా ఉండి కీలకపాత్ర వహించారు. 30కి పైగా కేసుల్లో సిద్దిపేట జైలుకు సైతం వెళ్లారు.


ఊపిరులూదిన 'అయిల నర్సింహులు'



గజ్వేల్: ఈ ప్రాంతం దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా నిలుస్తుంది. ప్రత్యేకించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షతో సాగిన తెలంగాణ ఉద్యమంలో గజ్వేల్ పోషించిన పాత్ర చిరస్థాయిగా నిలిచి పోయిందని చెప్పొచ్చు. 1969లో జరిగిన కాల్పుల్లో పట్టణానికి చెందిన అయిల నర్సింహులు అసువులు బాశాడు. ఉద్యమంలో భాగంగా గజ్వేల్‌లోని చౌరస్తా వద్ద విద్యార్థులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో కాల్పులు జరిగాయి. ఇందులో 12 ఏళ్ల బాలుడు తూటాలకు బలైపోయాడు. ఈ సందర్భంగా మరో విద్యార్థి సైతం గాయపడ్డాడు. ఈ సంఘటన అప్పట్లో తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 'అయిల నర్సింహులు' రక్తంతో తడిసిన ఈ నేల.. ప్రతి దఫా పోరాటంలోనూ అదే తరహా స్ఫూర్తిని కనబరిచింది. 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన చేసిన కేంద్రం వెనక్కి తగ్గిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలు జరిగాయి. ఇందులో భాగంగానే 2010 జనవరిలో అప్పటి ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తన పార్టీ కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆమరణ దీక్షను చేపట్టారు. అప్పట్లో టీడీపీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి సైతం అదే తరహాలో దీక్షకు సైతం పూనుకున్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమాల్లో టీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన మాదాసు శ్రీనివాస్‌తోపాటు మరెందరో తమవంతు పాత్ర పోషించారు. ప్రజా, ఉద్యోగ సంఘాలు పోరాటంలో తలమునలయ్యాయి. అణువణువునా తెలంగాణ స్ఫూర్తిని నింపుకున్న గజ్వేల్ చివరకు కేసీఆర్ సొంత నియోజకవర్గంగా మారటం యాదృశ్చికంగా జరిగిపోయింది.

అయ్యో పాపం

కుంటలో నవజాత శిశువు మృతదేహం



కుంట కాలువలో ఉన్న శిశువు మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): అప్పుడే పుట్టిన నవజాత మగ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు సమీపంలోని కుడి కుంటలో పడేశారు. ఈ ఘటన మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... కుండికుంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన నవజాత మగశిశువును పడేశారు. అప్పటికే పసికందు మృతి చెంది ఉన్నాడు. కుంట కాలువ వద్ద శిశువు మృతదేహం ఉన్న విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఇక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

పైపుల కింద పడి.. కార్మికుడి మృతి



అజయ్‌కుమార్ రౌత్ మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): ప్రమాదవశాత్తు పైపుల కింద పడి కార్మికుడు మృతిచెందాడు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నింపాడకు చెందిన అజయ్‌కుమార్ రౌత్(46) ఐదేళ్లుగా ఎంపీఎల్ స్టీల్ పరిశ్రమలో పైపులను లోడ్ చేసే పని చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం కూడా పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పైపుల కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఇక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

చికెన్ వండనని చెప్పిన భార్య

మనస్తాపంతో భర్త ఆత్మహత్య



దశరథ్ మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): భార్య చికెన్ వండి పెట్టనన్నందుకు భర్త క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో చోటుచేసుకుంది. బెజ్జంకి ఎస్ఐ క్రిష్ణారెడ్డి కథనం ప్రకారం.... ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దశరథ్(40) తన భార్య సంగోలి ముగ్గురు పిల్లలతో కలిసి మూడేళ్లుగా పౌల్ట్రీఫాంలో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. గత నెల 30న అతడికి ఆరోగ్యం బాగా లేకుంటే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. ఇంటికి వచ్చాక అతను చికెన్ వండమంటే డాక్టర్ నాన్‌వెజ్ తినొద్దన్నాడని భార్య చెప్పింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. చికెన్ వండను అన్నందుకు మనస్తాపం చెందిన దశరథ్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఇక్కడే చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య సంగోలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.



కాస్పరాజ్ మృతదేహం

సిద్దిపేటకమాన్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకికి చెందిన కాటా కాస్పరాజ్ (58) కుటుంబానికి దూరంగా పట్టణంలో 15 ఏళ్లుగా ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. అతను కూలీ పని చేస్తున్నాడు. అంబేడ్కర్ సర్కిల్‌లోని విగ్రహం పైకి ఎక్కే మెట్ల వద్ద శనివారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఇక్కడికి చేరుకొని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామాయంపేట(మెదక్): వివాహిత చెరువు దూకి ఆత్మహత్య పాల్పడింది. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చేగుంట మండలం కరీంనగర్ చెందిన సరితకు సిద్దిపేట జిల్లా రాయపోలు చెందిన కరుణాకర్‌తో 2021లో వివాహమైంది. వారికి కుమారుడు ఉన్నాడు. పెళ్లయినప్పటి నుంచి అత్తింటి వేధింపులతో పలుమార్లు పుట్టింటికి వస్తే తల్లిదండ్రులు నచ్చచెప్పి పంపించేవారు. శుక్రవారం రాత్రి కూడా భార్యాభర్తలు గొడవ పడ్డారు. కోపాద్రిక్తురాలైన ఆమె బస్సు ఎక్కి ధర్మారంలో దిగి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం చెరువులో మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అత్తింటి వేధింపులతోనే కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. కేసును ఎస్ఐ రంజిత్ దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో...

రాయపోలు(దుబ్బాక): జీవితంపై విరక్తితో మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రాయపోలు మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి కథనం మేరకు.. కొత్తపల్లికి చెందిన మన్నె మహేశ్వరి (38)కి 20 ఏళ్ల కిందట ఇదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో వివాహమైంది. భర్తతో విడిపోయి హైదరాబాద్‌లో ఉంటున్న సంతోష్‌కుమార్‌ను వివాహం చేసుకోగా వారికి ఓ కొడుకు పుట్టాడు. ఆ తర్వాత అతనితోనూ విడిపోయి ఇంకొక వ్యక్తి అయిన జగన్‌తో సహజీవనం చేస్తుంది. కాగా ఇటీవల ఆమె ఆరోగ్యం బాగా లేకపోవడంతో కొడుకుతో కలిసి ఆమె పుట్టిల్లు అయిన కొత్తపల్లిలోకి వచ్చి ఉంటుంది. తన ఆరోగ్యం పాడైపోయిందని, కొడుకు భవిష్యత్ గురించి దిగులు చెందుతుంది. కాగా, శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసిన తర్వాత తన బెడ్‌రూంలో పడుకుంటానని వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే జీవితంపై విరక్తి చెందినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.